క్లుప్తంగా

నగరేశ్వరుడికి నవధాన్యాల అలంకరణ



నాగాయలంక: స్థానిక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో నగరేశ్వరుడిని వరి కంకులు, నవధాన్యాలతో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు అలంకరించారు. నవధాన్యాల అలంకారంతో పూజ జరిపితే లోక కల్యాణం సిద్ధించి రైతులకు వరి సిరి కలుగుతుందని అర్చకుడు చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, ఆర్య వైశ్య సంఘ ప్రముఖులు తాడికొండ సత్యనారాయణ, దేసు సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య, మునగాల మోహనరావు, చిట్టా శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

రేమాలవారిపాలెం(నాగాయలంక): పేర్లవానిలంక గ్రామంలోని రామాలయంలో శనివారం 108 పర్యాయాల హనుమాన్ చాలీసా పారాయణం, పూజలు వైభవంగా జరిగాయి. గ్రామస్తులు, టి.కొత్తపాలెం శ్రీ సీతారామ భక్త సేవా సమాజం నేతృత్వంలో చాలీసా, భజన నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో వెయ్యి మందికి కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త పేర్ల భీమేశ్వరరావు, రాజేష్, సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ పిరాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సాయం



ఎదురుమొండి(నాగాయలంక): మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలోని ఎదురుమొండి దీవిలో ఇళ్లు దెబ్బతిని నిరాశ్రయులైన 20 కుటుంబాలకు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సాయం అందజేశారు. కృష్ణా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ టీఎస్ఎస్ బాలాజీ నేతృత్వంలో వంట సామగ్రి కిట్లు, టార్పాలిన్లు బాధితులకు అందజేశారు. సర్పంచ్ భర్త కన్నా వెంకటేశ్వరరావు, జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి భవిరి శంకరనాథ్, మండల చైర్మన్ శివ విష్ణువర్ధన్, వైస్ చైర్మన్ మునగాల కుటుంబరావు, జీవిత కాల సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి కొడాలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లికి చెందిన గూడపాటి ఆదిశేషు కాలు విరిగింది. ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిశేష ప్రధాన సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు బస్సు తగలడంతో ఎడమకాలు విరిగింది. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. చల్లపల్లిలో వైద్య చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం తరలించారు.

ఆరోగ్యం కోసం ‘ఆడుదాం ఆంధ్రా’

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఆడుదాం ఆంధ్రా పోస్టర్ల ఆవిష్కరణ

అవనిగడ్డ: క్రీడా నైపుణ్యం, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం పెంపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శనివారం ఆడుదాం ఆంధ్రా మస్కట్, పోస్టర్లను ఎమ్మెల్యే సింహాద్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకూ జరిగే ఈ పోటీల్లో 15 ఏళ్లు దాటిన వారందరూ పాల్గొనవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి ఝాన్సీలక్ష్మి, నియోజకవర్గ టెక్నికల్ ఇన్‌చార్జి రమణ, నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కోసూరు పూర్ణచంద్రరావు, కార్యదర్శి గరికపాటి మారుతి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ. భానుప్రకాష్, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.



అవనిగడ్డలో ఆడుదాం ఆంధ్రా పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు

ప్రతిభను వెలికితీసేందుకే..

పెడన: యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని, కార్యక్రమం జయప్రదానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చేయాలని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీలక్ష్మితో కలిసి ఆడుదాం ఆంధ్రా సన్నాహక సమావేశం శనివారం మార్కెట్ యార్డ్ సమావేశం హాల్‌లో నిర్వహించారు. రాజీవ్ మాట్లాడుతూ ఆసక్తిగల క్రీడాకారుల పేర్లను సచివాలయంలో నమోదు చేయించి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. ఈ నెల 13 వరకు నమోదు ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ నెల 15 నుంచి ఆటల పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. మొదట సచివాలయం పరిధిలో పోటీలు ఉంటాయని, ఇక్కడ గెలుపొందిన వారికి మండల స్థాయిలోను, మండల స్థాయిలో గెలిచిన వారికి నియోజకవర్గ స్థాయిలోను పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి చోటా గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తారన్నారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలోను, అక్కడ కూడా గెలిస్తే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని, వీటిల్లో ఆసక్తి ఉన్న వారు పేర్లను వలంటీర్ల ద్వారా సచివాలయంలో నమోదు చేయించాలని చెప్పారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా కరపత్రాలను విడుదల చేశారు. క్రీడా పరికరాలు, ఆట వస్తువులు సచివాలయాల పరిధిలోని సిబ్బందికి అప్పగించారు. సమావేశంలో పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, నాయకులు కొండవీటి నాగబాబు, బండారు మల్లి, వెంకట రామానాయుడు, అచ్యుతరావు, వెంకటరాజు, రామానాయుడు, మహేష్, సురేష్ రంగబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేసిన రాజీవ్, ఝాన్సీలక్ష్మి, చారుమతి తదితరులు

అధైర్యపడవద్దు.. అండగా ఉంటాం

పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులు ఎవరూ అధైర్య పడవద్దని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని మేకవానిపాలెం, తపసిపూడి, గోపువానిపాలెం, కానూరు, మోడి, తాళ్లపాలెంలో తుపానుకు నీట మునిగిన వరి, వేరుశనగ పొలాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని రైతులతో కలిసి పొలాల్లోకి వెళ్లిన కిట్టు నీట మునిగిన పనలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. పంట నష్టం వివరాలను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతిఒక్క రైతుకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లంకే వెంకటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, మేకవానిపాలెం మాజీ సర్పంచి మేక లవకుమార్, తపసిపూడి సర్పంచి చందన మస్తాన్, కానూరు ఉప సర్పంచ్ గోపు మురళి, ఆయా గ్రామాల రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కానూరులో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న పేర్ని కిట్టు

మంగళాపురంలో వికసిత్ భారత్ సభ

చల్లపల్లి: చల్లపల్లి మండలం మంగళాపురంలో శనివారం గ్రామ పంచాయతీ వద్ద వికసిత్ భారత్ సభ జరిగింది. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తుంగల వెంకటగిరి మాట్లాడుతూ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉజ్వల యోజన ప్రయోజనాలను వివరించారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, పంచాయతీ ఈఓ బీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

● కోనేరుసెంటర్: మండల పరిధి అరిశేపల్లి గ్రామంలో తాళ్లపాలెం వైద్య సిబ్బంది శనివారం వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించి గ్రామస్తులకు టీబీతో పాటు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామసభ నిర్వహించి 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు సాయిసుష్మ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ కృపారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



ఉప్పుతో రూపొందించిన గణేశుని ఆకృతి



కన్యకాంబ ఆలయంలో నాగ శిలల అలంకరణలో దీపాలు



కన్యకాంబ ఆలయంలో త్రిశూలంతో కూడిన ఓం ఆకృతిలో దీపాలంకరణ

నాగాయలంక: స్థానిక నగరేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో శనివారం సహస్ర కార్తిక దీపాలంకరణ ఉత్సవం, కృష్ణాతీరంలో రామలింగేశ్వరునికి నవహారతుల కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ దంపతులు కుటుంబ సభ్యులతో హాజరై రెండు కార్యక్రమాలను తిలకించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, శ్రీరామ పాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావులు డీఎస్పీని శేషవస్త్రాలతో సత్కరించారు. అర్చకుడు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో మునగాల కుటుంబరావు దంపతులు ప్రధాన పూజ జరిపి శివలింగం జ్యోతిని వెలిగించారు. చిట్టా వాణి నేతృత్వంలో స్థానిక సంకర్షణ భజన మండలి సభ్యులు ఓం, శివలింగం, స్వస్తిక్, పద్మాలు, వివిధ ఆకృతులలో కార్తిక ప్రమిదలను వెలిగించారు. ఆర్యవైశ్యసంఘం నాయకులు, కమిటీ సభ్యులు సేవలందించారు. కృష్ణాతీరంలో శ్రీరామలింగేశ్వరునికి నిత్య నవహారతులు శోభాయమానంగా కొనసాగాయి.

ఎన్జీఓ యూనిట్ కార్యదర్శిగా మాధవేంద్రరావు

చల్లపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు ఐక్యతతో ముందుకు సాగాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చల్లపల్లి యూనిట్ కార్యవర్గ సమావేశం జరిగింది. యూనిట్ అధ్యక్షుడు తోట సుధాకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యదర్శిగా చల్లపల్లి పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, ఉపాధ్యక్షులుగా కె.రామకోటేశ్వరరావు, రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి హేమ ప్రకాష్, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

రామాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేటలో చారిత్రక కోదండ రామాలయం పునర్నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. చెక్కలమేడ సమీపంలోని ఈ ఆలయం జీర్ణోద్ధరణకు శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఆలయ కమిటీ సభ్యులు శంకుస్థాపన చేశారు. శనివారం పిల్లర్ల నిర్మాణ పనులను చేపట్టారు. పనులను ఆలయ కమిటీ ప్రతినిధి నూకల ప్రసాద్, కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

దివిసీమ దివిటీ పుస్తకావిష్కరణ

అవనిగడ్డ: దివంగత ఎంపీ సనకా బుచ్చికోటయ్య నిస్వార్థ ప్రజా సేవకుడిగా పేరుతెచ్చుకున్నారని విరసం కార్యదర్శి ప్రొఫెసర్ కాశీం అన్నారు. స్థానిక ఎస్‌బీకే భవనంలో శనివారం సనకా చూటే బుచ్చికోటయ్య జీవిత చరిత్రపై రచించిన దివిసీమ దివిటీ పుస్తకాన్ని కాసీం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బుచ్చికోటయ్య నిస్వార్థ రాజకీయ నాయకుడిగా నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. ఆయన జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని చెప్పారు. తొలుత బుచ్చికోటయ్య చిత్రపటానికి కాసీం, గుత్తికొండ రవీంద్రనాథ్ ఠాగూర్, మహాలక్ష్మి, బుచ్చికోటయ్య కుమారుడు చూటే పూలమాల వేసి నివాళులర్పించారు. విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ, లిబరేషన్ పార్టీ నాయకులు డి. హరనాథ్, దివి ఏరియా నాయకుడు మారుబోయిన పులేంద్రరావు, న్యాయవాది పర్చూరి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

రేపు వికసిత్ భారత్ సదస్సు

కోనేరుసెంటర్: వికసిత్ భారత్ సదస్సు ఈ నెల 11వ తేదీ ఉదయం 10.45 గంటలకు రాజ్‌భవన్‌లో ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా జరుగుతుందని కృష్ణా యూనివర్సిటీ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ డాక్టర్ డి. రామశేఖరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ ఆన్‌లైన్‌లో యువతకు, కళాశాల విద్యార్థులకు సందేశమిస్తారని చెప్పారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉన్నత విద్యా మండలి ఉన్నత అధికారులు పాల్గొనే ఈ ప్రత్యేక కార్యక్రమానికి యూనివర్సిటీ అనుసంధానకర్తగా వ్యవహరిస్తోందని చెప్పారు. కృష్ణా విశ్వవిద్యాలయం అనుబంధ అంతర కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, సంబంధిత కార్యక్రమం జియో ట్యాగింగ్ ఫొటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

మారెమ్మ సన్నిధిలో లక్ష దీపోత్సవం




లక్ష్మీపురం(చల్లపల్లి): కార్తిక మాసం సందర్భంగా లక్ష్మీపురం శివారు చింతలమడలో గ్రామ దేవత మారెమ్మ తల్లి సన్నిధిలో లక్ష దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తిక ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ కమిటీ పెద్దలు నూకల ప్రసాద్ పర్యవేక్షణలో మునిశెట్టి బాలయ్య కుటుంబం ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం ఏర్పాటు చేయగా మహిళలు తరలివచ్చి కార్తిక దీపాలు వెలిగించారు. మారెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి విరాళం

పెడన: స్థానిక బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఉచిత మధ్యాహ్న భోజన పథకానికి శనివారం అయ్యే ఖర్చు రూ.5 వేలను ఉన్నత విద్య విశ్రాంత డీవైఈఓ మట్టా రాధాకృష్ణమూర్తి అందజేశారు. కళాశాల లైబ్రేరియన్, సైన్స్ అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ నారాయణరావు మృతి



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి మాజీ ఎంపీటీసీ, దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమాని అరజా నారాయణరావు (64) శనివారం ఉదయం మృతిచెందారు. కాంగ్రెస్ పార్టీలో ఈయన చురుకుగా పనిచేశారు. గ్రామంలో సంగీత, సాహిత్య మహోత్సవాలను ఏర్పాటు చేసేవారు. సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి విగ్రహం గ్రామంలో ఏర్పాటు చేసేందుకు ఎంతగానో కృషి చేశారు. ఈయన కోడలు అరజా సంధ్యారాణి సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేడు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

మచిలీపట్నంటౌన్: భగవద్గీత శ్లోక కంఠస్థ జిల్లా స్థాయి పోటీలు ఆదివారం ఏర్పాటు చేశామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కృష్ణవేణి ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. భగవద్గీత 10వ అధ్యాయం విభూది యోగం 42 శ్లోకాలపై పోటీలు జరుగుతాయన్నారు. ఎల్‌కేజీ నుంచి 3వ తరగతి వరకు 1 నుంచి 10 శ్లోకాలు, 4 నుంచి 7వ తరగతి వరకు 1 నుంచి 20 శ్లోకాలు, 8 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు, మహిళలు, పురుషులకు 1 నుంచి 42 శ్లోకాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు.

రూ. 26.78 లక్షల బీమా చెక్కు అందజేత



చిలకలపూడి(మచిలీపట్నం): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మల్లవోలు శాఖలో గృహానికి రుణం తీసుకుని మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి ఎస్‌బీఐ లైఫ్ రిన్ రక్ష పథకం ద్వారా శనివారం బీమా చెక్కును అందజేశారు. మల్లవోలు గ్రామానికి చెందిన బచ్చు శివనాగేశ్వరరావు ఇటీవల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గృహానికి రుణం తీసుకున్నాడు. ఈ రుణానికి సంబంధించి రిన్ రక్ష పథకంలో పాలసీ కూడా తీసుకున్నాడు. నాగేశ్వరరావు మృతిచెందటంతో రూ. 26,78,600 బీమా చెక్కును నాగేశ్వరరావు భార్య బి. పద్మావతికి ఆంధ్రా బ్యాంక్ ఏజీఎం వీవీ ఫణి రామకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఫణి రామకుమార్ మాట్లాడుతూ ప్రతి గృహ రుణ గ్రహీత రిన్ రక్ష పథకం ద్వారా బీమా పొంది ఉంటే అనుకోని ఘటనల వల్ల మరణిస్తే కుటుంబ సభ్యులకు బీమా చెల్లిస్తామని వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎం. రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సు పుస్తకాల పంపిణీ

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ కోర్సు విద్యార్థులకు కోర్సు పుస్తకాలను శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు అందించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో వీటిని ప్రిన్సిపాల్ ఉమారాణి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంటపాత్రలు, బియ్యం అందజేత



కోడూరు: జరుగువానిపాలెం గ్రామానికి చెందిన అప్పికట్ల లంకేశ్వరరావు పూరిల్లు మిచాంగ్ తుపానుకు కుప్పకూలింది. బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సభ్యులు వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, 25 కిలలో బియ్యం కట్టను శనివారం అందజేశారు. శాఖ మండల చైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు, కాగిత రామారావు, సభ్యులు తోట శ్రీనివాసరావు, జన్నా రవిశంకర్, కొండవీటి సురేష్, గోనా వేణు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపు

గూడూరు: తుపాను ప్రభావంతో పంట పొలాల్లో నిలిచిన నీరు బయటకు పోయేందుకు వీలుగా మండలంలోని రాయవరం గ్రామ పరిధిలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు రెండు రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయి. మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు స్థానిక సర్పంచి నందం మల్లీశ్వరి ఆధ్వర్యంలో రోజుకు 30 మంది చొప్పున కూలీలు గుర్రపుడెక్క తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు 3 కిలో మీటర్ల మేర పనులు జరిగాయని సర్పంచ్ తెలిపారు. దీనితో పొలాల్లో నీరు బయటకు పోతోందని చెప్పారు.

పెన్షనర్ల వితరణ



మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు మొహమ్మద్ రహ్మతుల్లా గత నెల 19న మృతిచెందాడు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన మొత్తం రూ. 36,800లను వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్‌తో కలిసి మృతుడి భార్య అఫ్రపున్నీసాకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో గృహ సారథులు ఆరిఫ్, దుర్గాదేవి, వలంటీర్ జరీనా, పింఛనుదారులు పాల్గొన్నారు.